

# జాతకం

## అనామకుడు

కథ

"నాకు పెళ్ళిచూపుల వ్యవహారం ఏమీ తెలియదు. ఆ సమయానికి మీరూ చెల్లెమ్మా వచ్చి అన్నీ చూసుకోవాలి" అన్నాడు ప్రకాశరావు.

"మీరు ఇంత చెప్పాలా? సుగుణ మీకెంతో మాకూ అంతేకాదూ? మేం చూసుకుంటాంలెండి. ఐతే ఆ సమయంలో మాత్రం మీ చాదస్తాలు మీరు వదిలెయ్యాలి మరి. పెళ్ళిచూపులంటే ఆడపిల్లకి ఎంతో అవమానంగా ఉంటుంది లాంటి ఆలోచనలు పెట్టుకోకండి. మగపిల్లాడి తల్లిదండ్రులైనంత మాత్రాన మనల్ని అవమానించేటట్లు ఉండాలా అని అనుకోకండి. మన పిల్లకోసం మనం కాస్త కష్టపడతాం అనుకోండి- సరేనా?" అని అడిగాడు రాఘవరావు.

"సరేనండీ- మీరెలా చెప్తే అలానే చేస్తానన్నాగా. సుగుణ సుఖంకన్న నాకు కావల్సింది ఏముంది?" అన్నాడు ప్రకాశరావు.

"మీకో సంగతి చెప్పడం మర్చిపోయాను. వాళ్ళకి జాతకాలంటే మహా నమ్మకం. సుగుణ జాతకచక్రం ఒకటి ఇవ్వండి. ఇప్పుడు సిద్ధంగా ఉంటే సరే, లేకపోతే ఒకటి వేయించి ఉంచండి. పెళ్ళిచూపుల నాటికన్నా మనం దాన్ని వాళ్ళకి ఇవ్వాలి. వాళ్ళు వాళ్ళకి తెలిసిన ఎవరికో చూపించుకుంటారుట. సరేనా?"

"రాఘవరావుగారూ- మీకు తెలుసుగా నేను జాతకాల్ని నమ్మను. అందుకే సుగుణకి చక్రం వేయించలేదు. ఇప్పుడు కూడా" అని ప్రకాశరావు అంటూండగా రాఘవరావు అందుకుని-

"అయిందేదో అయిపోయింది. ఇప్పుడు జాతకచక్రం వేయించడమెంత పని? కంప్యూటర్ మీద చక్రంవేసి ఇచ్చేవాళ్ళు వీధికొకరు ఉంటున్నారు. వేయించి ఉంచండి. మీ నమ్మకాలని పక్కనపెట్టండి. ముందు ఇవ్వలేకపోయినా- పెళ్ళిచూపుల రోజునైనా వాళ్ళకి ఇద్దాం. వీలైనంత తొందరగా పెళ్ళిచూపులకి ఏర్పాటుచేసేస్తాను సరేనా?" అని ప్రకాశరావు సమాధానం కోసం చూడకుండా వెళ్ళిపోయాడు రాఘవరావు.

దార్లో సుగుణ జాతకచక్రం వేయించుకుని, నెమ్మదిగా ఇంటికి చేరి, హాల్లో సోఫాలో కూచుని-

"అమ్మా- సుగుణా" అంటూ పిలిచాడు ప్రకాశరావు. ఆ పిలుపులో ఎంతో ఆప్యాయతా, అభిమానం వినిపించాయి. ప్రకాశరావు ఎప్పుడు సుగుణని పిలిచినా అలానే పిలుస్తాడు.

"ఏంటి నాన్నా?" అంటూ తండ్రి దగ్గరకి వచ్చింది సుగుణ. సుగుణ వంక ఆనందంగా చూసాడు ప్రకాశరావు. సుగుణని ఎప్పుడు చూసినా ప్రకాశరావు అలానే చూస్తాడు. జీవితంలో తనకి దొరికిన గొప్ప పెన్నిధి సుగుణలా అనిపిస్తుంది అతనికి.

"కంప్యూటర్ మీద నీ జాతక చక్రం వేయించి తెచ్చానమ్మా లోపల పెట్టు" అన్నాడు ప్రకాశరావు.

"నా జాతకమెందుకు నాన్నా ఇప్పుడు?" అని అడిగింది సుగుణ.

"నీకు సంబంధాలు చూడమని రాఘవరావుగారికి చెప్పానమ్మా. ఆయన తన ఎరికలో ఒక మంచి సంబంధం ఉందని చెప్పి, వాళ్ళకి నీ ఫోటో ఇచ్చారు. వాళ్ళకి నువ్వు నచ్చావుట. పెళ్ళిచూపులకి వస్తారుట. వాళ్ళకి జాతకాలంటే నమ్మకంట. నీ జాతక చక్రం కావాలంటున్నారుట. అందుకని" అడిగాడు ప్రకాశరావు.

"నువ్వు జాతకాలు నమ్మవు కదా? మరి ఎందుకు చక్రం వేయించి ఇవ్వడం?" అంది సుగుణ.

"ఎవరి నమ్మకం వాళ్ళది. వాళ్ళు నమ్మి అడిగితే మనం ఇవ్వననడం ఎందుకు?"

అలా అంటూన్న ప్రకాశరావుని చూస్తున్న సుగుణకి ఎందుకో కన్నీళ్ళు వచ్చాయి. అవి ప్రకాశరావు కంటపడ్డాయి.

"ఎందుకు తల్లీ ఏడుస్తున్నావు?" అంటూ దగ్గరకి తీసుకుని తల నిమిరసాగాడు.

"నాన్నా నాకు పెళ్ళి చేయడం కోసం నువ్వు నీ నమ్మకాలని వదులుకుంటున్నావు కదూ?" అని అడిగింది సుగుణ.

"పిచ్చిపిల్లా- పెళ్ళి చెయ్యడమంటే మాటలా? వాళ్ళూ మనమూ ఒకరి నమ్మకాలని ఒకరు గుర్తించాలి. గౌరవించాలి. వాళ్ళు చెప్పినట్లు మనం చెయ్యాలా అని బెట్టు చేసుకుని కూచుంటే పనులు అవుతాయా చెప్పు."

"మనం వాళ్ళ నమ్మకాలను గౌరవిస్తాం. వాళ్ళు చెప్పినవన్నీ వింటాం. వాళ్ళు మన మాట అలా వింటారా?"

"ఏ పరిస్థితి వస్తుందని నేను ఇన్నాళ్ళూ భయపడుతూ ఉన్నానో అదే వచ్చింది. నా కోసం నువ్వు నీ నమ్మకాలనేకాదు- నీ ఆత్మాభిమానాన్ని కూడా వదిలేసుకోవల్సి వస్తోంది. నన్ను కన్న పాపానికి నువ్వు ఓ మగపిల్లాడిని కన్న వాళ్ళ దగ్గర భయపడుతూ- వాళ్ళ కోరికల్ని తీరుస్తూ- వాళ్ళు చెప్పినట్లల్లా చేస్తూ తలుచుకునే కొద్దీ నాకు" అని అంటున్న సుగుణ కళ్ళల్లో నీళ్ళూ, గొంతులో బాధా పెల్లుబుకాయి.

అలా సుగుణని చూస్తున్న ప్రకాశరావుకీ దుఃఖం ఆగలేదు.

"నువ్వలా అనకమ్మా. నువ్వు నా కడుపున పుట్టడమే నా అదృష్టం అని నేను అనుకుంటున్నాను. అలాంటి దాన్ని ఖర్మని ఎలా అనుకోగలనమ్మా? నా బాధ అదికాదు. ఇన్నాళ్ళూ నువ్వు ఏది కావాలని కోరుకున్నా నేను నీకు ఇవ్వగలిగాను. మంచి స్కూలూ, మంచి కాలేజీ- అన్నీ నీకు కావల్సినట్లే చెయ్యగలిగాను. నీకు కావల్సిన బట్టలైనా, నగలైనా, నువ్వు అడిగిందే తడవు కొనివ్వగలిగాను. ఎప్పుడు నేను నీకు తోడుగా ఉండాలని నువ్వు అనుకున్నా నీ వెంటే ఉండి నీకు ధైర్యాన్ని ఇవ్వగలిగాను. నువ్వు అడగనప్పుడు కూడా ఏది మంచిదో ఆలోచించి, అది నీకు ఏర్పాటుచేసాను. ఈరోజు నీ పెళ్ళి విషయంలో నేను నీకు కావల్సినట్లో, నాకు కావల్సినట్లో చెయ్యలేకపోతున్నాను. అదేనమ్మా నా బాధ. ఇంత అపురూపంగా పెంచుకున్న

నిన్ను, ఎవరికో ఒకరికిచ్చి పెళ్ళిచేసి పంపించడమే కష్టం. అలాంటిది- ఆ పెళ్ళికొడుకుని నువ్వు కోరుకున్నట్లుగా తేగలనా అనే భయపడుతున్నాను. ఈ సమాజం ఆడపిల్ల తండ్రిని ఎంత అశక్తుడిని చేస్తుందో చూస్తోంటే బాధగా ఉంది తల్లీ" అంటూ తన ఆవేదనని ఆపుకోలేకపోయాడు ప్రకాశరావు.

తండ్రి ఏడుపుని చూసిన సుగుణ తన ఏడుపుని తగ్గించుకుంది. "చూద్దాం నాన్నా అంతా మనకి కావల్సినట్లే జరుగుతుందేమో. నాకు పెళ్ళి చేసుకుని వెళ్ళిపోవాలని పెద్ద కోరిక ఏమీలేదు. మనకి నచ్చినట్లైతే సరేసరి. అలా కాకపోతే మాత్రం ఏముంది? నాకు ఉద్యోగం ఉంది. నా కాళ్ళమీద నేను నిలపడగలను. నాకు నీతోడూ ఎలానూ ఉంది. నువ్వు పెళ్ళిమాట ఎత్తితే నేను కాదనకుండా ఉండడానికి ముఖ్యకారణం నిన్ను బాధపెట్టకూడదనే. కూతురు పెళ్ళి చెయ్యకుండా ఉన్నాడు- వాడేం తండ్రి అని నలుగురూ అంటారు. నిన్ను ఎవరైనా అలా అంటూ ఉంటే భరించడం కష్టం. అందుకే నీ ప్రయత్నాన్ని నేను ఆపడంలేదు. ఏమవుతుందో ఏం చెప్పగలం? నువ్వు మాత్రం నా గురించి బాధపడకు. సరేనా?" అని అడిగింది సుగుణ.

"నాకు నా గురించి కాదమ్మా బెంగ- నీ గురించే" అని అన్నాడు ప్రకాశరావు.

ఆ మర్నాడు సాయంత్రమే ప్రకాశరావింటికి సుగుణని చూసుకుందుకు పిల్లాడూ, పిల్లాడి తల్లిదండ్రులూ వచ్చారు.

కావల్సిన ఏర్పాట్లన్నీ చేసి నడపాల్సిన కార్యక్రమాన్నంతా కూడా రాఘవరావూ, భార్యా నడిపారు.

మాట్లాడాల్సిందంతా కూడా వాళ్ళే మాట్లాడారు. తన్ని అడిగిన ప్రశ్నలకి క్లుప్తంగా సమాధానాలు చెప్పింది సుగుణ. ఆ అవసరం కూడా రాలేదు ప్రకాశరావుకి.

"హైదారాబాద్‌లో మంచి ఉద్యోగంలో ఉన్నావు- మరి పెళ్ళయ్యాక బెంగుళూరు వెళ్ళాల్సివస్తే ఏం చేస్తావు" అని పిల్లాడి తండ్రి తన్ని అడిగినప్పుడు- అదే ప్రశ్న తన తండ్రి పిల్లాడిని అడగలేకపోతున్నాడే అని తనలో తాను అనుకుందే తప్ప ఏమీ సమాధానం చెప్పలేదు సుగుణ. రాఘవరావే పిల్ల చదువుకి బెంగుళూరులో కూడా మంచి ఉద్యోగం వస్తుందని సర్ది చెప్పేసాడు.

వెళ్ళడానికి లేస్తూ- "పిల్ల నచ్చిందీ- ఏ విషయమూ తొందరలోనే తెలియచేస్తాం" అని అంది పిల్లాడి తల్లి.

వెళ్ళబోతూ- "మాకు పిల్ల నచ్చడం ఒక ఎత్తు. అంతకన్న ముఖ్యం జాతకాలు కుదరడం. మీరు పిల్ల జాతకం ఇస్తే మేం మాకు నమ్మకమైన ఒకాయన ఉన్నారు. ఆయనకి చూపిస్తాం. ఆయన జాతకాలు కుదిరాయంటే కానీ" అని అన్నాడు పిల్లాడి తండ్రి.

"నిన్ననే వేయించి ఉంచాను. తెస్తానుండండి" అంటూ ప్రకాశరావు కదలబోయాడు.

"ఉండండి నేను తెస్తాను" అని సుగుణ లోపలికి వెళ్ళి జాతకం వేసి వున్న కాగితంతో వచ్చింది. వచ్చి తన తండ్రితోనో, పిల్లాడి తండ్రితోనో కాకుండా నేరుగా పిల్లాడినే

"మీకు జాతకాలంటే అంత నమ్మకమా?" అని అడిగింది.

పెళ్ళిచూపులు జరుగుతున్నంతసేపూ ఎవరితోనూ తనంత తాను మాట్లాడని సుగుణ, పిల్లాడిని అలా అడిగేసరికి అందరికీ ఆశ్చర్యం కలిగింది. తన్నలా 'జాతకాలంటే మీకు అంత నమ్మకమా?' అని సుగుణ అడగగానే ఏంచెప్పాలో తెలియక తండ్రివంక చూసాడు పిల్లాడు.

"అవునమ్మా" అంటూ పిల్లాడి తండ్రి ఏదో చెప్పబోయేంతలో-

"మీకు నమ్మకం ఉందని నాకు తెలుసు. రాఘవ మావయ్య చెప్పారు. నేను అడుగుతున్నది మీ అబ్బాయిని" అంది సుగుణ. అలా అంటున్న సుగుణ కంఠంలో స్థిరత్వం ధ్వనించిందే తప్ప మర్యాద లోపించలేదు.

ఇంక తప్పదన్నట్లు పిల్లాడు- "మన నమ్మకమేకాదుగా- మన పెద్దవాళ్ళ నమ్మకాలు కూడా" అంటూ ఏదో చెప్పడం మొదలెట్టి ఏంచెప్పాలో తెలియక ఆగిపోయాడు.

"నాకూ, మా నాన్నకీ కూడా జాతకాల మీద నమ్మకంలేదు. ఐనా మీరు అడిగారు కాబట్టి ఇస్తాం. అలాగే మాకూ" అని సుగుణ ముగించేలోగానే.

"మీకు కావల్సి వస్తే మీరూ తీసుకోండి నా జాతకం. మీరు మీకు కావల్సిన జ్యోతిష్కుడికి చూపించుకోండి" అని అన్నాడు పిల్లాడు.

"మాకు కావల్సింది ఈ జాతకం కాదు. ఇది ముందు జరగబోయే విషయాలు చెప్తుందని మీ నమ్మకం. మీ నమ్మకాన్ని నేను కాదనడంలేదు కూడా. ఐతే నాదే కాకుండా నాకు పుట్టబోయే పిల్లల ఆరోగ్యమూ, సుఖమూ దీనిమీద ఆధారపడి ఉంటుందని నేననుకోను. ఆ విషయం తెలుసుకుందుకు కావల్సింది ఇంకోటి ఉంది. నాకు అది కావాలి"

"మీరు అడుగున్నది ఏమిటో నాకు తెలియడంలేదు."

నేనిలా అడుగుతున్నానని నేను మిమ్మల్ని అవమానిస్తున్నానని మాత్రం అనుకోకండి. అది నా ఉద్దేశం కాదు. భార్యాభర్తలు కలిసి బావుండడానికి జాతకాలు కలవడం ముఖ్యం అనుకుని నా జాతకం అడుగుతున్నారు మీరు. ఐతే అంతకన్న ముఖ్యంగా మీరు అడగాల్సింది తెలుసుకోవల్సింది నా ఆరోగ్య పరిస్థితి. అందులోనూ ముఖ్యమైంది నాకు ఎయిడ్స్ ఉందో లేదో తెలిపే HIV రిపోర్ట్" అని సుగుణ చెప్తూండగానే-

"మీకు ఎయిడ్స్-" అని ఆగాడు పిల్లాడు.

"నాకు ఎయిడ్స్ లేదు. ఇదిగో నా రిపోర్ట్. అలాగే నాకు మీ HIV రిపోర్ట్ కావాలి. సంసార జీవితం సుఖంగా ఉండాలంటే ముందుగా చూసుకోవల్సింది ఈరిపోర్టే అని నానమ్మకం. అందుకని మీరు పరీక్ష చేయించుకుని ఆ రిపోర్ట్ మాకు ఇవ్వండి. నిజానికి నా ఉద్దేశంలో అదే మాకైనా, మీకైనా, పుట్టబోయే పిల్లలకైనా అవసరమైన జాతకచక్రం."

చివరో మాట:

సుగుణ ఆ మాటలు అన్న తర్వాత ఏం జరిగిందో రచయితకి తెలియదు కానీ ఏం జరిగి ఉంటుందో ఊహించగలడు. ఐతే ఆ ఊహ పాఠకుడు కూడా చెయ్యగలడు. అంతేకాదు. పాఠకుల్లో కొందరికి ఆ తర్వాత ఏం జరిగిందో తెలిసి కూడా ఉండవచ్చు.

అందుకే తను రాసిన కథను ఎక్కడ కావల్సి వస్తే అక్కడ ఆపేసుకునే స్వేచ్ఛను వాడుకుంటూ-

ఆ తర్వాత ఏమయిందో, ఏమైతే బాగుంటుందో ఎవరన్నా చెప్తే బావుండునని అనుకుంటూ-

ఈ కథకి ఇక్కడే ముగింపు కాకపోయినా ఇక్కడ ఆపేస్తున్నాడు రచయిత. •

